# మిల్లర్ల దోపిడీకి రైతన్న బలి

- ఐదు రోజులుగా కొనుగోళ్లు నిలిపివేత
- ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు బేఖాతర్
- క్వింటాలుకు 8 కిలోల వరకు కోత
- చోద్యం చూస్తున్న అధికారులు



కొనుగోళ్లు నిలిచిపోవడంతో కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

**వెల్గటూర్:** అకాల వర్షాలతో ధాన్యం కళ్లముందే కొట్టుకుపోయి రైతులు నష్టపోగా, మరోవైపు మిల్లర్లు క్వింటాలుకు 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. వీటిని ప్రశ్నించినందుకు మండలంలోని చాలా కేంద్రాల్లో ఐదు రోజులుగా కొనుగోళ్లు నిలిపివేశారు. మిల్లర్లు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు సిండికేట్‌గా మారి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ఏ ఒక్క నాయకుడూ రాకపోగా, దగ్గరుండి మరీ మిల్లర్లకు కొమ్ము కాస్తూ రైతులను నట్టేటముంచుతున్నారు. మిల్లర్లు ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తూ రైతులను దోచుకుంటున్నా అధికారులు మాత్రం వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతుండడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇష్టారాజ్యంగా మిల్లర్ల కోతలు**

అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యాన్ని సైతం ఎటువంటి కోతలు లేకుండా, కొర్రీలు పెట్టకుండా మిల్లర్లు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. తడిచిన ధాన్యం సంగతి పక్కన పెడితే ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉన్న ధాన్యాన్ని సైతం ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తూ రైతులను దోచుకుంటున్నారు. మొక్కట్రావుపేటకు చెందిన ఓ రైతు 380 బస్తాల ధాన్యం తూకం వేసి మిల్లుకు తరలించగా క్వింటాలుకు 8 కిలోల కోతకు ఒప్పుకోకపోవడంతో తిరిగి కొనుగోలు కేంద్రంలోనే దింపి వెళ్లారు. ఎనిమిది రోజులుగా కేంద్రంలోనే టార్పాలిన్ కప్పి ఉంచాడు. ఇంత జరిగినా అధికారులు మిల్లుపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదు. ప్రభుత్వ నిబంధనలు మిల్లర్లు పాటించాలా? లేక మిల్లర్ల నిబంధనలు ప్రభుతం పాటిస్తుందా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చాలా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిచి రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

### 8 కిలోల తరుగు తీస్తున్నారు



ఇప్పటికే అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను మిల్లర్లు క్వింటాలుకు 8 కిలోలు తరుగు తీస్తూ నిండా ముంచుతున్నారు. ప్రభుత్వం తేమ లేకపోయినా కొంటామని చెబుతున్నా, ఇక్కడ నిర్వాహకులు మాత్రం కొనడం లేదు. పైగా నాణ్యత ఉన్న ధాన్యానికి సైతం 8 కిలోలు కోతలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలి.

– కంటెం తిరుపతి, పాశిగామ గ్రామ రైతు

### నిబంధనలు పాటించడం లేదు



గత 10 రోజుల క్రితం కేంద్రంలోనే బస్తాకు 2 కిలోల చొప్పున ఎక్కువ తూకం వేసి 380 బస్తాల ధాన్యం మిల్లుకు పంపగా మిల్లులో 8 కిలోలు కోత పెడతానంటే వద్దని చెప్పిన. ప్రశ్నించినందుకు ధాన్యం బస్తాలు మొత్తం తెచ్చి సెంటర్లోనే దించివెళ్లారు. 10 రోజులుగా సెంటర్లోనే బస్తాలు ఉన్నా ఏ అధికారి మిల్లుపై చర్యలు తీసుకోవడం లేదు.

– బుద్దె బాపు, మొక్కట్రావుపేట, రైతు

### చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉన్న ధాన్యాన్ని ఎటువంటి కోతలు లేకుండా మిల్లర్లు తీసుకోవాల్సిందే. నాణ్యతా ప్రమాణాలు పాటించి, ఏఈవో సర్టిఫై చేసిన ధాన్యాన్ని తూర్పారబట్టాల్సిన అవసరం లేకుండానే మిల్లర్లు కొనుగోలు చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యానికి కోత విధించిన మిల్లర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– రజినీకాంత్, డీఎం, సివిల్ సప్లై

## క్లుప్తంగా

### బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

**జగిత్యాలరూరల్:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో జాతీయ రహదారి 63 ని మేడిపల్లి మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని మేడిపల్లి గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో ఇళ్ల స్థలాల మధ్యలో నుంచి 2 కి.మీ దూరం ఉందని, తరుచూ రోడ్డు ప్రమాదాలతో ప్రాణనష్టం జరుగుతోందని విన్నవించారు. కార్యక్రమంలో ఎండీ.ఆసీఫ్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

### మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



జేసీబీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

**జగిత్యాలరూరల్:** మండలంలోని హన్మాజీపేట గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గుట్టల నుంచి మట్టి తరలింపును సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడి బంధువు పేరున కండ్లపల్లి శివారులోని 506 సర్వే నంబర్‌లో మట్టిని తీసుకునేందుకు మైనింగ్ శాఖ అధికారులు అనుమతిచ్చారు. దీంతో హన్మాజీపేట గ్రామస్తులు తమ గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంటనే మట్టి తరలింపును నిలిపివేయాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

### బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



స్థానికులతో మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్

**కోరుట్ల:** బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మన ఇంటికి మన సంజయ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పదో వార్డులో సోమవారం రాత్రి పర్యటించారు. వార్డులో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, స్థానిక కౌన్సిలర్ ఉన్నారు.

### రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని వినతి



సమస్యను వివరిస్తున్న జలేందర్‌రెడ్డి

**రాయికల్:** మండలంలోని కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు కటింగ్ పేరిట దోపిడీ చేస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘ నాయకులు ఏలేటి జలేందర్‌రెడ్డి సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లతకు సమస్యను వివరించారు. ఇటిక్యాల కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని, వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు కట్కం తిరుపతిరెడ్డి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

### నష్టపరిహారం చెల్లించాలని ప్రజావాణిలో రైతుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

**మల్యాల:** అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు సోమవారం ప్రజావాణిలో కొడిమ్యాల మండల తహసీల్దార్ స్వర్ణకు వినతి పత్రం అందించారు. మండలంలో సుమారు 7వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఎకరానికి రూ.10వేల పంట నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా నేటికి పరిహారం అందలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి మమత, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**జగిత్యాల:** అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులను వేగవంతంగా పూర్తి చేస్తే అభివృద్ధి కనబడుతుందని, ఆలస్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, పట్టణ అధ్యక్షుడు రాజేశ్ పాల్గొన్నారు.

**ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలి**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని లింగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.లింగంపేటలో బస్తీ దవాఖానా కోసం స్థలం పరిశీలించారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

మున్సిపల్ కార్మికుడు, వాటర్‌లైన్‌మెన్ లింగంపేటకు చెందిన కొత్తూరి లక్ష్మీరాజం అనారోగ్యంతో మరణించగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు.

**రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి సీఎం కప్**

**జగిత్యాలరూరల్:** రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ములాసపు లక్ష్మి, జెడ్పీటీసీ మహేశ్, కౌన్సిలర్లు, సర్పంచులు,ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

**చౌడలమ్మ పట్నాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**

జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లిలోని శ్రీదేవి చౌడలమ్మ పట్నాల జాతరలో సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు రజిత, ప్రకాశ్, ఎంపీటీసీ మహేశ్, నాయకులు నరేశ్, లక్ష్మణ్, తిరుపతిగౌడ్, రవి, శ్రీకాంత్‌పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



మేడిపెల్లిలో క్రీడాకారులతో జెడ్పీ వైస్‌చైర్మన్



రాయికల్‌లో జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్

**కథలాపూర్:** గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు అన్నారు. సోమవారం మేడిపెల్లి మండల కేంద్రంలో సీఎం కప్ మండలస్థాయి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైందని సీఎం కేసీఆర్ గుర్తించారన్నారు. దీనికోసం సీఎం కప్ పేరిట మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, పీడీ లక్ష్మీరాంనాయక్, సర్పంచులు పాల్గొన్నారు.

**రాయికల్:** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సీఎం కప్ ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. సోమవారం భూపతిపూర్ హైస్కూల్‌లో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్‌చైర్మన్ మోర హన్మండ్లు, సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఎస్సై కిరణ్, తహసీల్దార్ ఖయ్యూం పాల్గొన్నారు.

**కోరుట్ల రూరల్:** పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ క్రీడాపోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంపీపీ తోట నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీరటి రాజేశ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంఈవో గంగుల నరేశం, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పీఈటీలు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం:** క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. సోమవారం మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సీఎం కప్ క్రీడాపోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీడీవో ప్రభ, ఎస్సై ఉమాసాగర్, వైద్యాధికారి శ్రీజ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకట్, పీడీ కృష్ణప్రసాద్, పీఈటీలు, నాయకులు పాల్గొన్నారు.

**కథలాపూర్:** మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలు అట్టహాసంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, ఎంపీడీవో జనార్దన్, ఎంఈవో ఆనందరావు, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీలు, ఏఎంసీ వైస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**పెగడపల్లి:** క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ రాజేందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రమణారావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ ఆటల పోటీలు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నిర్మల, వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీ జమున, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

**సారంగాపూర్:** బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సీఎం కప్ క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్,ఎంపీడీవో మల్లారెడ్డి, ఎంఈవో భీమయ్య, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

**ధర్మపురి:** ధర్మపురిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో భూమయ్య తదితరులున్నారు.

# యువత సామాజిక స్పృహను అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



సీఎం కప్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మల్లాపూర్:** యువత క్రీడలతో పాటు సామాజిక స్పృహను అలవర్చుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని సిరిపూర్‌లో స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించి మాట్లాడారు. ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి క్రీడా పోటీలు దోహదపడుతాయని అన్నారు. మున్నూరు కాపు సంఘం కల్యాణ మండప నిర్మాణానికి రూ.5 లక్షల ప్రొసిడింగ్ పత్రాలను సంఘం నాయకులకు అందజేశారు.

**భవనానికి భూమిపూజ**

మండలంలోని మొగిలిపేటలో వడ్డెర సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పరిశీలన**

**కోరుట్ల:** పట్టణంలోని మార్కెట్ యార్డు స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్‌నాన్ వెజ్ మార్కెట్‌ను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సోమవారం పరిశీలించి మాట్లాడారు. మార్కెట్ యార్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

**మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**కోరుట్ల రూరల్:** పట్టణంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల సంతోష్ రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్, సింగిల్ విండో చైర్మన్లు సింగిరెడ్డి నర్సారెడ్డి, భూమారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, నాయకులు గుడ్ల మనోహర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు అరికట్టాలి



పెగడపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**పెగడపల్లి:** మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అధిక తూకం, తాలు తప్ప పేరిట మిల్లర్ల దోపిడీని నిరసిస్తూ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి రంగు మారితే ఇదే అదనుగా భావించి కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకుతింటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు మల్లారెడ్డి, శంకర్, విజయభాస్కర్, సతీశ్‌రెడ్డి, సత్తిరెడ్డి, మల్లేశం, సధీర్, తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

**మల్యాల:** పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రొడ్డ వేని రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, సోమవారం ఎమ్మెల్యే రవిశంకర్ బాధితుడి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులకు పార్టీ రూ.2లక్షల బీమా చెక్కు అందజేశారు. ప్రతీ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మెన్నేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగ రావు,బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వేంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కప్**

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభకు పదును పెట్టి, ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో సోమవారం ఎమ్మెల్యే రవిశంకర్ సీఎం కప్ ఆటలను ప్రారంభించారు. క్రీడాకారులతో ఎమ్మెల్యే కబడ్డీ ఆడి, యువకుల్లో ఉత్సాహం నింపారు.

# విద్యార్థినికి కాంగ్రెస్ నాయకుల సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**మల్లాపూర్:** గ్రామీణ ప్రాంతం నుంచి ఇంటర్ సెకండియర్ బైపీసీలో మణిమాల స్టేట్ సెకండ్ టాపర్‌గా నిలవడం అభినందనీయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిరిపూర్‌లో విద్యార్థిని నునావత్ మణిమాలను సన్మానించారు.మణిమాల భవిష్యత్‌లో మరింత ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నునావత్ రాజు, నాయకులు గడ్డం లక్ష్మీతిరెడ్డి, ఏలేటి నర్సారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

**కోరుట్ల:** రాష్ట్ర వ్యాప్తంగా రేపు జరిగే పాలీసెట్ ఎంట్రెన్స్‌కు పట్టణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కోరుట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన 5 సెంటర్లలో 1376 మంది విద్యార్థులు ఎంట్రెన్స్ రాయనున్నారు.ఎంట్రెన్స్ ర్యాంకింగ్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంజినీరింగ్, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ, కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

**కథలాపూర్:** మండలంలోని గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో 2005–06 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించుకున్నారు. గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద విద్యార్థులు సమావేశమై చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆట,పాటలతో సందడి చేశారు. సాయంత్రం సామూహికంగా భోజనాలు చేశారు.

# 'నిధులు వచ్చినట్లు నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా'

**వెల్గటూర్:** రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ప్రతినెలా రూ.5 లక్షల నిధులు విడుదల చేసినట్లు నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని వెల్గటూర్ సర్పంచ్ మేరుగు మురళీ గౌడ్ బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సర్పంచ్ చేసిన వాఖ్యలను ప్రస్తావిస్తూ, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసిన చరిత్ర మీ అధికార పార్టీ నేతలదని, ఇప్పటికీ 9 నెలలుగా బిల్లు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అలాంటిది ప్రతినెలా 5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని చెప్పడానికి సిగ్గుండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచులు మురళి, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ అనుమాల మంజుల, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఘనంగా శ్రీలక్ష్మీ నృసింహస్వామి జాతర**

**కథలాపూర్:** మేడిపెల్లి మండలం మాచాపూర్‌లో శ్రీలక్ష్మీ నృసింహస్వామి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సర్పంచ్ బాలరాజు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం**

**మల్యాల:** కొడిమ్యాల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పిట్టల రాజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన జోలపురపు శివ తన స్నేహితులు, సింగపూర్‌లోని తన సన్నిహితులు, భైరి రవి సహకారంతో రూ.56,000 విరాళాలు సేకరించారు. మృతుడి చెల్లె పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, బాండ్ పేపర్‌ను సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, పి.రంజిత్, కొండ నవీన్, కృష్ణ, కిరణ్, తదితరులు ఉన్నారు.

**ఆలయానికి వాటర్ కూలర్ వితరణ**

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని శ్రీ పొలస్తేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం వాటర్‌కూలర్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. పొలాస గ్రామానికి చెందిన దర అశోక్‌కుమార్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వాటర్‌కూలర్‌ను అందించారు. ఈవో వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రవి పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

**మల్లాపూర్:** మండలంలోని వేంపల్లిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను సోమవారం సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్, వార్డు సభ్యులు పరామర్శించారు. రెండు కుటుంబాలకు గ్రామపంచాయతీ నిధుల నుంచి దహన సంస్కారాలకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మెండె రూప, కల్లెడ మనస్విని, నాయకులు పాల్గొన్నారు.

**విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శులు**

**ఇబ్రహీంపట్నం:** తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని 15 రోజులపాటు సమ్మె చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం విధుల్లో చేరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభుకు కార్యదర్శులు విధుల్లో చేరుతున్నట్లు రిపోర్టు ఇచ్చారు.

**కథలాపూర్:** కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో సమ్మెలో ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం విధుల్లో చేరినట్లు ఎంపీడీవోలు జనార్దన్, వెంకటేశ్‌జాదవ్ తెలిపారు. కథలాపూర్ మండలంలో 14 మంది, మేడిపెల్లి మండలంలో 15 మంది జేపీఎస్‌లు విధుల్లో చేరారు. ఈ మేరకు కార్యాలయాల్లో రిపోర్ట్ చేశారు.